# చిన్నమ్మి

శంఖవరం సరోజా సింధూరి

"నాను పేమించింది సదుకోని సిన్నమ్మిని."
"సెడి పోయినాకే నదూ కునేది!"
అన్న కోటీను చిన్నమ్మి ఎందుకు
చదువుకోవాలనుకుందో తెలిశాక
ఏం చేశాడు?



కళ్ళ నిండా చివ్వున ఊరిన నీళ్ళు చిన్నమ్మి బుగ్గల మీదకు రాలాయి. ఎదురగా ఉన్న సముద్రంలా గుండెల్లో ఒకటే ఘోష.

చిన్నమ్మిది ఓణీల వయసు. ముద్ద బంతి సొగసు.

రోజూ అయితే సముద్రం మెలమెల్లగా జారే చీకట్లను చూస్తూనే, ఆ చీకట్లలో విరగకాసే చుక్కల్ని కళ్ళతోనే కోస్తునే సన్న సన్నగా జానపదాలు పాడేది.

ఒడ్డును కోసుకుంటూ వచ్చే కెరటాల్లో వరికిణీ కుచ్చిళ్ళు తడుపుకుని, గాలికి ఆర బెట్టుకుంటూ, ఆకాశాన చందమామను చూసి తనలో తను సిగ్గు పడేది.

కానీ ఈ రోజు మాత్రం-

ఆమె చూపు చుక్కల్ని కొయ్యటం లేదు. కళ్ళలో ఊరే కన్నీటితో మసక బారి పోతోంది. ఆమె చెంపలు చంద్రుని చూసి ఎరు పెక్కటం లేదు. అశ్రు ధారల్లో తడిసి పోతున్నాయి.

చిన్నమ్మి కోరిక చాలా చిన్నదే. తను సదూకోవాల. ఆ ఊరికి కొత్తగా వచ్చిన మేట్టారి కాడ అచ్చురాలు నేర్వాల.

"సదూ గిదువ్ అన్న వంటే ఈపు సాకిరేవు బండవుద్ది. ఈ డొచ్చిన పిల్లవి ... ఆ కుర్ర మేటారి కాడ బోయి అచ్చురాలు నేరుస్తావా? అవ్వ! ఈ మాట గిన కోటీను మావ ఇన్నాడో మనువూ గినువూ దొడ్డిదార్న బోద్ది. ఏసికాలు కట్టమాక .. బుద్ధి గుండు. తల్లి లేని పిల్లవని గారాబం సేత్తే నెత్తి నెక్కి తొక్కు తున్నావ్." గౌరయ్య శివతాండవం చేశాడు.

"సదూ కుంటే తప్పేం టయ్యా?"

"ఎదు రాడమాకే సిన్నమ్మీ! కోటీను సదివిండా నువ్ సదవడానికి? ను వ్వచ్చురాలు నేడిస్తే ఆడి కెంత అగమానం! సదూకున్న పిల్లని ఆడు నచ్చినా సేను కోడు. పుట్టంగల్నే ను వ్వాడి ఆలివని నిర్నాయిక మైనది. ఆడి కిట్టం లేని పని నువ్ నసేమిరా సెయ్ కూడదు."

"ఇదేం అన్యాయం అయ్యా? నాను సదూకుంటే ఆడి కేటి నట్టం?" చిన్నమ్మి స్వరం ఆశ్చర్యంలో తడిసిపోయింది.

"సదూకున్న పెళ్ళం మొగుడ్ని లెక్క సేత్తదా? మొగోని మాట ఇంటదా సలు?"

చిన్నమ్మి పక్కుమని నవ్వింది. "అదా, అయ్యా నీ బాద! మంచోనివే. ఇదో సూడూ ... అట్టాంటి దిగుల్లేం పెట్టుకో మాక. నాను ఎంత సదూకున్నా కోటీను కాబోయే పెళ్ళాన్నే నయ్యా. మొగున్ని లెక్క సెయ్యక ఓర్ని లెక్క సెత్తాను?"

"ఏమోనే సిన్నమ్మీ .. నా కయన్నీ తెల్దు. నువ్ సదూకుంటం ఆడి కిట్టం లేదు. ఆ నామర్దా పని మాత్తరం సెయ్య మాక."

"అది గాదయ్యా .. సదూ కోటం నామర్దా పని..."

"సిన్నమ్మీ ... ఇంకేం ...సెప్మాక!" అయ్య అంత ఖరాఖండీగా చెప్పాక -

చుట్టూ మునురు కుంటున్న చీకట్లలో ముఖం దాచుకుని 'ఏడవా ఏం చెయ్యనూ! అన్నట్టుగా ఏడుస్తోంది చిన్నమ్మి.

గౌరయ్య సముద్రం మీద కెళ్ళి వలేసి చేపలు పట్టుకొచ్చి సప్పుడల్లా ప్రాణం పోకా రాకా గిల గిలా కొట్టుకుంటూ ఎగిరెగిరి పడే చేపల్ని చూసి తెగ జాలిపడే చిన్నమ్మికి, ఇప్పుడు తన గుండె కూడా గట్టున పడ్డ చేపలా టప టపా కొట్టుకోవడం చూసి తన మీద తనకే ఎక్కడ లేని జాలి కలుగుతోంది.

ఆకాశాన్ని అంటుకోవాలని ఉవ్వెత్తున లేచిన అనంత సాగర కెరటంలా తన మనసు మారుమూలల్లోంచి తలెత్తిన కోర్కెల అల తిరిగి తన గుండె సంద్రం లోకే విరిగి పడి కరిగి పోతుంటే ఆవేదనతో తల్లడిల్లి పోతోంది చిన్నమ్మి.

"తను మడిసి గాదా? తనకు కోరిక లుండగూడదా? తన గుండెలో పుట్టిన సిన్న కోరి గ్గూడా తీర్చుకుంటానికి తనకు అక్కు లేదా? తను అచ్చురాలు నేరిస్తే మాత్తరం కోటీను మావ మాట ఏటి కిన్దు? మావ మావే గదా! కోటీను మా వంటే తనకు సదువంత ఇట్టం. సదు వంటే నేమో కోటీను మావంత ఇట్టం. ఏదీ ఒదులుకోలేదే ... ఏటి సేయ్యాల?"

"చిన్నమ్మీ!" ఆ పిలుపు స్నేహంలా చల్లగా ఉంది.

"నిన్నే చిన్నమ్మీ" ఈ పిలుపు ఓదార్పులా హాయిగా ఉంది.

"చూడు .. ఆ సముద్రంలో కెరటాలు ఎవ ర్నడిగి లేస్తున్నయ్? ఆకాశాన చుక్కలు ఎవరి కోసం పూస్తున్నాయ్? గాలి ని న్నడిగి వీచడం లేదు. పూలు న న్నడిగి విరియడం లేదు. మన గుండెలో కోర్కెలు కూడా అంతే చిన్నమ్మీ. వాటిని ఎవరి కోసమూ బలి చెయ్య కూడదు. కట్టు బాట్లతో గుండెను కట్టేసుకుంటే అది స్పందించడం మానేసి బండబారి పోతుంది. నువ్వు చదువుకోవా లనుకుంటున్నావ్. చదువుకో. నీ కోసం నువ్వు చదువుకో. నీలో పొంగే కోర్కెకు ఒక రేమిటి ఆనకట్ట వేసేది? రేపు నువ్వు బడికి వస్తున్నావ్. అంతే!"

"సారూ మరి మా అయ్య..."

"నీ కోరిక చెడ్డది కాదు. మీ అయ్యే కాదు చిన్నమ్మీ దేవుడు కూడా నో రెత్తలేడు. నిన్ను తప్పు పట్టలేడు."

చిన్నమ్మి కళ్ళలో ఇప్పుడు కూడా నీళ్ళు చివ్వున ఊరాయి. కానీ... ఈ నీళ్ళు తళ తళ మంటున్నయ్. చమక్ మంటూ మెరుస్తున్నయ్.

'అయ్యేంది... కోటీను మావేంది.. దేముడు అడ్డొచ్చినా సరే నాను సదూకుంటా'...

* * *

"మావా!" కోటీను అరిచిన అరుపుకు గుడిసె తలుపులు దడదడ కొట్టుకున్నయ్ గౌరయ్య గుండెలా.

"ఏటి? నా విన్నది నిజమేనా?"

"లోనకు రారా కోటీనూ!"

"ముంద రిది సెప్పు. దాన్ని సిన్నమ్మని ఆ కుర్రమేట్టారి కాడికి సదువు కంపుతున్నవా?"

"లోనకు రారా!"

"అరె.. బదులు సెప్పవయ్యా పెద్దమడిసీ!"

"ఆఁ.. దాని మొగం! ఏదో ఆడబొయి పిల్లకుంకల్తో పాటీ కూసుంటాంది. దానికి సదువేంటి?"

"పిల్లకుంకల్తో పాటీ కూసుంటం గాదు, మావా, మేట్టారితో అచ్చురాలు రాయించేసుకుని దిద్దుతాంది నీ

బిడ్డ. కలికటేర్ని జేత్తవా?"

"కూసోరా అల్లుడూ. నాలు గచ్చిరాలు రాంగనే కలికటే రవుద్దా? అ దేనాటికీ కోటీను పెళ్ళావే"

"కోటీను పెళ్ళానికి సదువుండ గూడ్దు. తెల్దేటి మావా నీకు?" కోటీను కళ్ళు ఎర్రబడ్డాయి.

గౌరయ్యకు కోటీనుముఖం చూస్తుంటే చెమట వట్టేసింది. అల్లుడి ముందు చెమటపట్టేట్టు చేసిన కూతురి మీద గొంతువరకూ తన్ను కొచ్చింది కోపం. "ఎంత సొప్పినా ఇనకుండా బడికెల్లి పోనాదిరా నీ కాబోయే పెళ్ళాం ! సేతనైతే ఇంటికి ఈడ్సుక రా పో !"

గౌరయ్య సవాలుకు సమాధానంగా పెద్ద పెద్ద అంగ లేస్తూ బడి వైపు నడిచాడు కోటీను.

స్వర్గానికి వెళ్ళే దారిలో -బాట కిరువైపులా విరగబూసిన ఏ రంగురంగుల రత్నాల పూలనో మైమరిచి చూస్తున్నట్టుగా చూస్తోంది చిన్నమ్మి నల్లటి పలక మీద సుద్దముక్కతో తను రాసిన అక్షరాల వరుసకేసి. ఒక్కొక్క అక్షరాన్నే ఒత్తి ఒత్తి పలుకుతూ... వసంతపు వేళలో తొలకరిలో తడిసి కూస్తూన్న కోయిల తా నైనట్టు పులకించి పోతోంది.

"సిన్నమ్మీ !"

పిడుగుపాటు లాంటి పిలుపుకు మైమరపు చెదరిపోయింది.

కోటీను ఇంకోసారి గావుకేక పెట్టేలోగానే భీతహరిణిలా కళ్ళు రెపరెపలాడిస్తూ అతడి కేసి చూసింది చిన్నమ్మి.

"లెగవే అడ్నుంచి ! నదూకుంటన్నవా? ఏ పూళ్ళేల్దామనీ?"

చివుక్కున లేచి నిలబడిన చిన్నమ్మి సుడిగాలిలో చిగురాకులా వణికిపోతోంది.

కోటీనులో ఇన్నాళ్ళూ ఓ ప్రేమికుడిని చూసింది. ఈ రోజదేమిటో అత డో రాక్షసుడిలా అన్పిస్తున్నా డామెకు.

"ఏమిటి కోటీనూ? ఇప్పు డేమైందని? చప్పున వారిద్దరి మధ్యకూ వచ్చి నిలబడ్డాడు మురళీధర్.

"యామైందా సారూ... నా క్కాబోయే పెళ్ళాం నదూకుంటాంది."

"అందులో త ప్పేముంది?"

"మొగునికి నదూ లేదు. పెళ్ళాం నదూకుంటాంది. ఇది తప్పుగాదా? మొగోనికి త లొంపులు గాదా?"

మురళీధర్ కోటీను దగ్గరగా నడిచి అతడి భుజం మీద చె య్యేశాడు. "చూడు, కోటీనూ, ఏదో నాలు గక్షరాలు నేర్చినంత మాత్రాన చిన్నమ్మి నిన్ను మించి పోతుందా? ఒక వేళ పోయింటే అనుకో. నీ భార్య ఉన్నతి నీకు గర్వకారణం కాదా? తల్లో, తండ్రో చదువుకుని ఉంటే రేపు పుట్టబోయే నీ పిల్లల భవిష్యత్తు ఎంత బాగుంటుంది ! కోటీనూ ! చదువు చాలా విలువైంది. చిన్నమ్మిలో ఆ కోరిక పుట్టినందుకే మనం సంతోషించాలి. అన్నట్టు నీ కిది తెలుసా? చిన్నమ్మి రెండు రోజుల్లో తెలుగు అక్షరాలు మొత్తం నేర్చుకుంది."

కోటీను మురళీధర్ చెప్పింది శ్రద్ధగా విన్నాడు. ఓ క్షణం మురళీధర్ కేసి దీర్ఘంగా చూసి చెప్పాడు - "సూడు సారూ! తమురు సెప్పింది తమరికి రైటు. నాను సెప్పేది నాకు రైటు. అంతే !"

మురళీధర్ నిస్సహాయంగా చూశాడు చిన్నమ్మికేసి.

"పాయే, సిన్నమ్మి పా! సదువులూ, సట్టుబండలూ నా పెళ్ళానికి అక్కర్లే !"

అంతవరకూ వధకు తెచ్చిన గొర్రెపిల్లలా తల వంచుకు నిలబడ్డ చిన్నమ్మి ఒక్కసారిగా రెప్ప లెత్తి మురళీధర్ వంక చూసింది.



## శ్రీకృష్ణ సీమ

శ్రీకృష్ణుడు పుట్టిన ఆ వ్రజ సీమ భాగ్యం ఎట్లాంటిదో నని లీలాశుకుడు అచ్చెరు వందిన వైనం, ఇదుగో 'శ్రీకృష్ణ కర్ణామృతంలో - ఇట్లా ఉంది:

చాపల్య సీమ చప లానుభవైక సీమ
చాతుర్య సీమ చతురానన శిల్ప సీమ
సౌరభ్యసీమ, సక లాద్భుత కేళి సీమ
సౌభాగ్య సీమ తదితం వ్రజ భాగ్య సీమ

ఆశాభంగంతో ఆ కళ్ళు ఎంతటి ఆవేదనతో చలిస్తున్నాయో, ఆమె మునిపంటి కింద నొక్కి పెట్టిన పెదవి ఎ మ రెంతటి దుఃఖంతో అదిరి పోతోందో మురళీధర్‌కు తెలుసు.

ఆమె ఆవేదన అతడిని అభి మంత్రించింది. ఆమె దుఃఖం అతడి హృదయపు అట్టడుగు పొరల్ని తాకింది. "కోటీనూ! చిన్నమ్మికి చదువుకోవా లనుంది. చదువు కుంటుంది." స్వరం దృఢంగా ఉంది.

"అట్టగయితే దాన్ని నాను కట్టుకోను." కోటీను కుతకుతలా డిపోయాడు.

"అదేంటి? చిన్నమ్మిని నువ్వు ప్రేమించలేదూ?"

"నాను పేమించింది నదూకోని సిన్నమ్మిని."

"చదువుకుంటే ఎవరూ చెడిపోరు కోటీనూ."

"సెడిపోయినాకే నదూకునేది !"

"అది వితండవాదం. దానికి సమాధానం శూన్యం.

మురళీధర్ చిన్నమ్మికేసి చూశాడు. చిన్నమ్మి మురళీధర్ కేసి చూసింది. తిరిగి కోటీను మీదికి కళ్ళు తిప్పింది. తరువాత మెల్లగా కళ్ళు దించి తన చేతిలోని పలక వంక చూసింది. ఆ పలక మీద మెరుస్తున్న అక్షరాల్ని చూసింది.

రెండు క్షణాల నిశ్శబ్దానంతరం మౌనంగా నేలమీద కూర్చుని అక్షరాల్ని దిద్దసాగింది.

కోటీను మండుతున్న అగ్నిగోళంలా అక్కడ్నుంచి నిప్పులు రాల్చుతూ కదిలాడు.

మురళీధర్ కళ్ళ నుంచి తన తల మీద అక్షతల్లా కురుస్తున్న అభినందనల్లో తడిసిపోతూ చిన్నమ్మి అనుకుంది - సాగరాన కెరటాలు ఎవ్వర్నడిగీ లేస్తన్నయ్? అకసాన సుక్కలు ఎవురికోసం పూస్తన్నయ్?

********

రోజులు పుదుతున్నయ్ వారాలై పెరుగుతున్నయ్. నెలలై కరుగుతున్నయ్. చిన్నమ్మి చదువుకుంటోంది. కేవలం తనకోసం తను చదువు కుంటోంది.

ఓ రోజు ... మునిమాపువేళ..... చిన్నమ్మి బడి నుంచి బయలుదేరి వడివడిగా గుడిసె చేరగానే గుమ్మంలోనే ఎదురయ్యాడు కోటీను.

"మావా! సారు దేముడు. దేముడితో నాకు రంకు గడతన్నవా? నీకు పావం సుట్టుకుంటుంది."

"అవ్... అదు గాక నీకు నాను దేముడ్నెట్టవుతా? ఆడే నీ దేముడు.. ఆడే నీ మొగుడు .. ఆడే నీ... !"

చిన్నమ్మి సివంగిలా దూకి కోటీను చొక్కా పట్టుకుని ఒక్క గుంజు గుంజింది. కోటీను ముందుకు తూలి పడబోయి నిలదొక్కుకుని చిన్నమ్మి జుట్టు దొరకబుచ్చుకుని ముందుకు వంచి ఫెడీ ఫెడీ మని గుద్దాడు.

గుడిసె చుట్టూ మనుషులు... చోద్యం చూస్తూన్న మనుషులు. ఇంతేనా... ఇంకేమన్నా జరిగితే బాగుండునని ఆరాట పడుతున్న మనుషులు.

చిన్నమ్మిలో సహనం నశించింది. ఒక్క ఉదుటున కోటీను చేతుల్లోంచి తన జుట్టు విడిపించుకుంది. "రేయ్... అసల్కి ను వ్వెవురివిరా? నా మీన సెయ్ సేస్కోటాన్కి నీ కెన్ని గుండెలు? నన్ను కట్టుకున్న మొగునివా? కన్న తండ్రివా? ఇంగో దెబ్బ నా ఒంటిమీన పడిందంటే సూడు.. ఏం సేత్తానో..."

"ఏం సేత్తవే .. నీ..... !"

మనసులో మండుతున్న అగ్ని పర్వతం ఫెటిల్లున బ్రద్దలై కళ్ళలోంచి ఎర్రటి లావా కురుస్తుండగా చెప్పింది -"సంపేత్తాను !"

క్రాచులా రేగబోయిన కోటీనును నలుగురూ కలిసి బయటకు నెట్టుకెళ్ళి పోయారు.

గౌరయ్య కూతురి కేసి ఎగా దిగా చూశాడు.

ఆ రోజు బడికొచ్చి అల్లరి పెట్టాక ఇదే కోటీను స మావ ఇంటికి రావడం. అప్పుడప్పుడూ దారిలో కనబడ్డా ఏనాడూ పలకరించలేదు. ఎన్నాళ్ళ తరువాతో దగ్గరగా కోటీనును చూసిన చిన్నమ్మి కనురెప్పలు ఒకింత సిగ్గుతో వాలిపోయాయ్. బుగ్గల్లో కాసిన్ని ఎరుపులు పొగుపడ్డాయ్.

కానీ - అలా వాలిన కనురెప్పలు ఉలిక్కిపడి గజగజ లాడడానికీ, బుగ్గల్లో పోగుపడ్డ ఎరుపులు పాలిపోవడానికీ అట్టేసేపు పట్టలేదు.

"మావా ! నీ బిడ్డను నదువుకు అంపొద్దన్నా ను వ్వినవ్లే. దాన్ని బతిమాల్నా. అదీ ఇన్లే. పోన్లే అని సరిపెట్టుకున్నా. సదివితే సదివిందిలే నా సిన్నమ్మే గదా అనుకున్నందుకు అదేటి సేత్తాందో తెల్సా?"

కోటీను తెలిసిం దేమిటో చిన్నమ్మికి కూడా తెలియదు. అందుకే అయోమయంగా, ఆశ్చర్యంగా అతడికేసి చూసింది భ్రుకుటి ముడిచి.

"ఏం జేసిందిరా, అల్లుడా, ఈ మాయిదార్ది?" గౌరయ్య హీన స్వరంతో అడిగాడు.

"నిజంగా నీకు తెల్దూ?"

"సత్తె పెమానకంగా నాకు తెల్దురా?"

"సెబితే గుండె పగిలి సావ్వు గదా?"

"ఈ గుండేనాడో బండబారి పోనాదిరా కోటీనూ !"

"అయితే ఇనుకో... నీ బిడ్డ... ఈ సిన్నమ్మి... నదూకుంటాని గ్గాదు బడి కెల్లేది. కుర్ర మేట్టారితో

కులకడానికి.''

''మాఁవా!''

చిన్నమ్మి అరిచిన అరుపుకు ఒక్కక్షణం కోటీను గుండె జల్లుమంది. తయాయించుకుని అన్నాడు - ''ఏంటికే... అట్ట గొంతు సించుకుంటవ్?''

''నా గొంతు సించుకోడం గాదు. నీ గొంతు సించుత! పీక నులిమేత్త!'' ఇప్పు డామె చిన్నమ్మి కాదు- భద్రకాళి.

''నోర్ముయ్!'' కోటీను చెయ్యి చిన్నమ్మి చెంపను ఛెళ్ళుమని తాకింది. ''పిల్లల్తో పాటే ను వ్వేంటికొన్తన్నవంటే కిలాడీ? అళ్ళు బోయిన గంటకు బయట బడతవ్ బళ్ళో నుంచి. ఏం జేస్తంటవే అంతసే పాడ? ఆడితో కులకటమేగా. ను వ్వాడ జేరింది. నతకటానిగ్గాదే.. నీ యమ్మ... ఆడి కోసరమేనే!''

''నిజవేనంటే ఆడు సొప్పేది?'' గొరయ్య చివాల్న లేచి చిన్నమ్మి జుట్టు పట్టుకుని లాగి వీపుమీద ఒక పిడిగుద్దు వేశాడు.

''నిజంగాక అబద్ధవాఁ? బడి జిమ్మి పత్తన్నా... బల్ల లెత్తి వత్తన్నా అని నీ కూతురు నీకు కతలు సెప్తాంటే నోరు దెర్పుకుని ఇంటానికి దప్ప ఏంటికి పనికొస్తవ్ నువ్వు?''

''నీకు దండం బెడత, కోటీను మావాఁ, అట్టాటి మాట లనమాక. నాను నచ్చి పోత... నాను నచ్చిపోత!'' చేతిలోని పుస్తకాల్ని తలకేసి బాదుకుంది చిన్నమ్మి.

''నువ్ జస్తే ఎట్నా? నీ సారు ఏడున్తడు పావం!''

కన్నీటితో మలినమైన ముఖంతో, రేగిపోయి పాయలు విడివడిన జుట్టుతో, వగిలిన హృదయంతో శోకదేవతలా ఉన్న చిన్నమ్మికి దగ్గరగా నడిచి అన్నాడు- ''థూ... ఇంత ఇనం తిని సావు! ను వ్వుండకాడ నా నొక్క సెనం గూడ వుండను.'' వినవిసా నడుచుకుంటూ కోటీను వెనకబడి పోయాడు.

దీవం పెట్టని ఆ గుడిసెలో కేవలం చీకటీ, చిన్నమ్మీ మిగిలిపోయారు.

★ ★ ★

రాత్రంత ప్రసవ వేదనతో తల్లడిల్లిపోయిన తూర్పుతల్లి కన్న నెత్తుటి కందు సముద్రంలోంచి ఎర్రెర్రగా పైకి వస్తోంది. అప్పుడప్పుడే విడివడుతున్న చీకట్లలో రేకులు విప్పుకుంటున్న వెలుగుల్లో రెండు చేతులతో తల పట్టుకుని శూన్యంలోకి చూస్తున్న మురళీధర్ చెవి పక్కగా ఉరిమింది ఓ స్వరం.

''సిన్నమ్మి నచ్చిపోయిందంట. గన్నేరు కాయలు నూరుకుని తినేసిం దంట.''

మురళీధర్ నడవడం లేదు. గనపెడుతూ పరిగెడుతున్నాడు. పరిగెత్తి... పరిగెత్తి... ''సిన్నమ్మీ!'' గావు కేకలు పెట్టి ఏడుస్తున్నాడు గొరయ్య.

''సిన్నమ్మీ!'' తనలో తాను గొణుక్కుంటున్నాడు కోటీను.

''మీ రెంత పిల్చినా, ఎంత అర్చినా నాను వలకను. నే నింకా నదూకోవాల. అందికే సార్గంలో బడికి పోతన్నా. అడయితే న న్నెవురూ అవరుగా?'' అంటున్నట్టు నిస్తేజంగా, నిర్లిప్తంగా ఏ దిగంతాల్లోకో చూస్తోంది చిన్నమ్మి.

మురళీధర్ పళ్ళు పటపట కొరికాడు. ఆవేదనతో, ఆవేశంతో అతడి ముఖం జేవురించింది. ఆగ్రహంతో నిలువెల్లా కంపించిపోతూ కంఠనాళాలు తెగేలా ఒక్కపెట్టున అరిచాడు. ''రేయ్ కోటీనూ! నువ్వురా హంతకుడివి! నువ్వే... నువ్వే చిన్నమ్మిని హత్య చేశావ్! మాటల ఈటెలతో ఆమె గుండెను తూట్లు పొడిచి చంపావ్! నిన్ను వదలను! పోలీసులకు పట్టిస్తాను! నువ్వు మోపిన నిందకే, కేవలం నువ్వు మోపిన నిందకే చిన్నమ్మి చనిపోయింది.''

మురళీధర్ పిచ్చిపట్టిన వాడిలా పరిగెత్తాడు బయటకు. మరో అరగంటకు గుమికూడిన జనాన్ని తోసుకుంటూ వచ్చారు పోలీసులు.

''వీడే ఇన్‌స్పెక్టర్... వీడే! చిన్నమ్మి చంపింది వీడే. కత్తులు కటార్లూ ఏమీ ఉపయోగించలేదు. కేవలం... కేవలం మాటలతోనే చంపాడు!'' మురళీధర్ స్వరం కోపంతో చిత్రంగా వణుకుతోంది.

కూతురి శవం ముందు కూర్చుని దుఃఖిస్తున్న గొరయ్య చటుక్కున లేచాడు. నూరేళ్ళ వృద్ధాప్యం ఒక్కసారిగా పైనబడ్డట్టు గడగడ వణికిపోతున్నా డతను. ఇన్‌స్పెక్టర్ కేసి వడివడిగా నడిచి చెప్పాడు, ''అయ్యా! ఇయ్యి మా సిన్నమ్మి పైట సెంగులో దొరికినాయ్!''

ఇన్‌స్పెక్టర్ గొరయ్య చేతిలోంచి రెండు మడతపెట్టిన కాగితాల్ని అందుకున్నాడు. ఒకదాన్ని విప్పదీశాడు.

''కోటీను మాఁవా!

''సాగరాన కెరటాలు ఎవు ర్నడిగి లేస్తన్నయ్? ఆకసాన సుక్కలు ఎవురి కోసం పూస్తన్నయ్? అందికే నాను నా కోసమే నదూకో వాలనుకున్నా అయ్యా నువ్వూ కా దన్నా సారు నాకు ధైర్యం సెప్పింది. సారే పుస్తకాలూ, పలకా కొని పెట్టింది పెన్నులూ, పెన్సిల్లూ తీ సిచ్చింది. నాకు నదువు నేర్పింది. అందికే సారు నాకు దేముడు. బడి జిమ్మే అయమ్మ మా నేత్త, బడి దేముడి గుడే గదా అని నానే సిమ్మి బల్ల లెత్తి ఆలిశంగా ఇంటి కొచ్చేదాన్ని. సా రొద్దని సెప్పినా ఇన్పించుకొనే దాన్ని గాదు. అంతేగాని, మావాఁ, ను వ్వనుకున్నట్టుగా నా నే తప్పూ సెయ్య లేదు. ను వ్వట్టాటి మాటలంటే కోపం పట్టలేక నిన్ను నంపేత్తానని తిట్టినా. నా మావని తిట్టినో రు ఇంకా పలగ్గూడదు. అందుకే నాను నచ్చిపోతన్నా!

''మాఁవా... నీ కో ఇనయం తెల్సా? అందరూ ముందు 'అ...ఆ'లు దిద్దుతా రంట. నాకు మాత్తరం, మావాఁ, నీ పేరు... రాయించుకుని నూరు మాట్లు దిద్దుకున్నా 'కోటీను మావ' అని నోటు పుస్తకమంతా రానుకున్నా. అ దెవురూ నూడకుండా నా పెట్టె అడుగున దానుకున్నా.. మన పెళ్ళి నాడు నీ కియ్యాలని. తీసి నూనుకో మావాఁ... నీ సిన్నమ్మి మాట అబద్ధమేమో!''

ఇన్‌స్పెక్టర్ ఆ ఉత్తరాన్ని మడిచి మరో కాగితం విప్పాడు. ''నా సావుకు ఎవురూ కారణం గాదు. నాకై నానే పోతన్నా. బతుకు మీన ఇరక్తితో పో తన్నా – సిన్నమ్మి.''

ఇన్‌స్పెక్టర్ ఆ ఉత్తరం చదవగానే మురళీధర్ కోటీను ముందుకు దూకుడుగా వచ్చి అన్నాడు ''చూశావా కోటీనూ! చిన్నమ్మి రాసిన వుత్తరం నీ ప్రాణాన్ని రక్షించింది. నిన్ను జైలు పాలు కాకుండా జేసింది. చదువు విలువ ఇప్పటికైనా తెలిసిందా? బహుశా... చిన్నమ్మి ఈ ఉత్తరాలు రాయటానికే చదువుకుని ఉంటుంది.''

** ** **

కళ్ళు మూసుకుని వేలి కొసలతో నుదుట రాసుకుంటున్న మురళీధర్ ఏదో చప్పుడైతే కళ్ళు తెరిచాడు.

ఎదురుగా కోటీను. ఎడమ చేతిలో ఓ పలకతో కుడి చేతిలో సుద్దముక్కతో తలొంచుకుని నిలబడి ఉన్నాడు.

అతడి కేసే ఆశ్చర్యంగా చూస్తున్న మురళీధర్‌తో అత నన్నాడు - ''సారూ! మా సిన్నమ్మి లాగా నానూ నదూకుంటా.''

మురళీధర్ కెందుకో కోటీనును చూస్తుంటే జాలి కలిగింది. ఆవేదనతో, పశ్చాత్తాపంతో చిక్కి శల్యమైన అతడిని సానుభూతిగా చూసి అతడి చేతిలోని పలకను అందుకొని సుద్దముక్కతో అక్షరాలు రాయ బోయాడు.

''సారూ!'' కోటీను పిలిచాడు.

'ఏమి' టన్నట్టు చూశాడు ఆగి.

''అ..ఆలు రాయొద్దు. 'సిన్నమ్మి' అని రాసియ్యండి. పూపిరున్నంత దాకా దిద్దుకుంటూ బతుకుతా.''

కోటీను గొంతులోని దుఃఖపు జీర మురళీధర్ గుండెను తాకింది. కొద్ది క్షణాల నిశ్శబ్దం తర్వాత పలక మీద 'చిన్నమ్మి' అని రాస్తుంటే అతడి కళ్ళ నుంచి ఓ అశ్రుకణం చప్పున రాలి అక్షరాల మీద పడి అతుక్కు పోయింది.

★



## శ్రీకృష్ణ జననం

*ఆ పూట గోప కులమంతా నందడే!*

*మరి యశోదమ్మ ఇంట్లో పండంటి బిడ్డ పుట్టాడంటే పండగే కదా...*

*ఆ అమ్మ లక్క లందరూ - ఇట్లా అనుకుంటూ ఆ శిశువుని చూడ్డానికి వెళ్ళారు అని బమ్మెర పోతనామాత్యుల వారి ప్రత్యక్ష వ్యాఖ్యానం!*

ఏమి నోము ఫలమో యింత ప్రొ ద్దొక వార్త
వింటి మబలలార వీను లలర
మన యశోద చిన్ని మగవాని గనెనట,
చూచి వత్త మమ్మ సుదతులార.